క్లుప్తంగా

దివ్యాంగులకు ఎలక్ట్రికల్ సైకిల్ పంపిణీ

అచ్చంపేట: అర్హులైన దివ్యాంగుల లబ్ధిదారులకు ఏలక్ట్రికల్ సైకిల్ అందజేశామని అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో దివ్యాంగులకు ఎలక్ట్రిక్ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దివ్యాంగుల కోసం 100 ఎలక్ట్రిక్ సైకిళ్లు మంజూరు కాగా, అర్హులైన 72 మంది దివ్యాంగుల లబ్ధిదారులకు అందజేశారు. సీఎం కేసీఆర్ దివ్యాంగులకు సహాయ సహకారాలు అందిస్తూ.. వారికి అండగా ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, ఎంపీపీ శాంతాబాయి, జెడ్పీటీసీ మంత్ర్యానాయక్, వెంకటలక్ష్మి, సీడీపీఓలు లక్ష్మి, దమయంతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వెల్దండ: మండల పరిధిలోని చెదురుపల్లికి చెందిన కొమ్ము నరసింహులు అనారోగ్యంతో మృతిచెందాడు. శుక్రవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు విజేందర్‌రెడ్డిలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి 50 కిలోల బియ్యంతో పాటు నగదు ఆర్థికసాయం అందజేశారు. ప్రధాని మంత్రి పథకం కింద 400 పోస్టల్ పాలసీ స్కీమ్ చెల్లిస్తే మృతిచెందిన కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు మోహన్‌రెడ్డి, వెంకటయ్య, అంజయ్య తదితరులు ఉన్నారు.

సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాధించాలి



అమ్రాబాద్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలం అభివృద్ధి చెందేలా కృషి చేయాలని జెడ్పీటీసీ రాంబాబు నాయక్ సూచించారు. శుక్రవారం పదర మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేస్తున్న పనుల వివరాలను రివ్యూ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కృషితో ఏర్పాటైన పదర మండలంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలే కృషి చేయాలన్నారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ వరుణ్‌కుమార్, ఎంపీడీఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ లక్ష్మిదేవి, సర్పంచ్‌లు ఉన్నారు.

ధర్మరక్ష నిధికి విరాళం



మన్ననూర్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతియేటా ధర్మరక్ష నిధి విరాళాలు సేకరిస్తామని జిల్లా అధ్యక్షుడు మిరియాల సుధాకరయ్య అన్నారు. శుక్రవారం అమ్రాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నిధితో వివిధ సేవా కార్యక్రమాలతో పాటూ ప్రత్యేక రోజుల్లో అన్నదానం, ఆధ్యాత్మిక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వెంకటరమణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి



కోడేరు: రైతులు సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని ఏడీఏ రఘు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో 2022 విస్తీర్ణం కింద క్లస్టర్ పరిధిలో వ్యవసాయ బోరు బావులు, ఎరువులు, కుంటల కింద రైతులు సాగుచేసిన వాటిని పరిశీలించి మాట్లాడారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. వర్షాకాలంలో ప్రభుత్వం సూచించిన మేరకు 20 రోజుల ముందుగానే వరినాట్లు వేసుకోవాలని సూచించారు. రైతులు పంటలు సాగు చేసేటప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. ఏఈఓ మధుసూదన్ రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఊరూరా బడిబాట



ఉప్పునుంతలలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెంట్లవెల్లి: మండలంలో కొద్ది రోజులుగా పెంట్లవెల్లి జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఉపాధ్యాయులు ప్రతి గ్రామంలో తిరిగి ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు గ్రామాల్లో బడిబాట కార్యక్రమం చేపట్టారు. మండలంలోని పలు గ్రామాలు తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో చేరాలని, పాఠశాలలోని వసతులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా డిజిటల్ క్లాస్‌లు, ఎల్ఈడి టీవీలు, మధ్యాహ్న భోజన పథకం, పుస్తకాల పంపిణీ వంటి ఎన్నో వసతులను తెలంగాణ ప్రభుత్వం కల్పించిందని, బడిఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరాలని, బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు బలరామకృష్ణారావు, నర్సింహ, విజేందర్, శ్రీను, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని జూపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజయ్య ప్రత్యేకంగా వారం రోజుల నుంచి గ్రామంలో 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రైవేట్ పాఠశాలలో ఉన్న వారిని, అంగన్‌వాడీ నుంచి ప్రమోట్ అయిన వారిని కలుస్తూ.. ప్రభుత్వ పాఠశాలలో చేరాలని తల్లిదండ్రులను కోరారు. అంజయ్య, పద్మ, ఉపాధ్యాయులు రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

తాడూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని జిల్లా సైన్స్ విద్యాధికారి కృష్ణారెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మేడిపూర్‌లో ఉపాధ్యాయులంతా కలిసి గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకె వెళ్లి ప్రభుత్వ విద్యావిధానంపై అవగాహన కల్పించారు. బడిఈడు కలిగిన ప్రతి పిల్లవాడు బడిలో ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనం ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు ఉదయం విద్యార్థులకు రాగి జావ అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు సాయిప్రభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మల్లేశ్వరంలో...

విద్యార్థుల ఇంటికి ఉపాధ్యాయులు

ఉప్పునుంతల: ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని వసతులు కల్పించాం. అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారు. మీరు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సిన అవసరం లేకుండా 'మన ఊరి- మన బడి'లోనే మీ పిల్లలను చదివించండని శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న దుస్తులు, ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం భోజనం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్, వర్క్ బుక్స్ అందిస్తామన్నారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించడానికి తొలిమెట్టు అనే కార్యక్రమాన్ని చేపట్టి విద్యార్థుల్లో అభ్యసన స్థాయిలను గణనీయంగా పెంచుతామన్నారు. గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించారనా చెప్పారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం హన్మంత్‌రెడ్డి, లక్ష్మారావు, శ్రీనివాసమూర్తి, అనురాధ, అనసూయ, కల్పన, సతీష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కొట్ర ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాలలో చేరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇంటింట ప్రచారం నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి విద్యానందించాలన్నారు. అనంతరం నూతనంగా విద్యార్థులను చేర్పించారు. ఎంపీటీసీ రాములు, హెచ్ఎం కృష్ణారెడ్డి, శోభన్‌బాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి పిల్లల చేరిక

ఉప్పునుంతల: స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గాజుల వెంకటేష్ తన ఇద్దరు పిల్లలను తాను పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనే చదివించుకుంటూ ఆదర్శంగా నిలిచాడు. తన పెద్ద కుమారుడు గౌతమ్‌ను మూడేళ్ల కిందట పాఠశాలలో చేర్పించగా.. శుక్రవారం తన చిన్న కుమారుడు రాహుల్‌ను కాంప్లెక్స్ హెచ్ఎం హన్మంత్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ సమక్షంలో పాఠశాలలో చేర్పించాడు. అంకితభావంతో ఉద్యోగ విధులను నిర్వర్తిస్తూ.. విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేష్‌ను మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు అభినందిస్తున్నారు.



ఆర్టీసీలో విలేజ్ బస్‌ఆఫీసర్ల నియామకం



కొల్లాపూర్‌లో విలేజ్ బస్ ఆఫీసర్లతో సమావేశం

కొల్లాపూర్: ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేసేందుకు డిపో పరిధిలో విలేజ్ బస్ ఆఫీసర్లను నియమించినట్లు డీఎం రాజేశ్వర్ తెలిపారు. శుక్రవారం కొల్లాపూర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో విలేజ్ బస్ ఆఫీసర్లకు దుస్తులు ఇతర సామగ్రి అందించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ రాజయ్య హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా వస్తు సామగ్రి పంపిణీ యుశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలతో సమావేశాలు కావడం, జాతరలు, ఇతర వేడుకలకు, వివాహాలకు బస్ సౌకర్యాలను ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలను విలేజ్ బస్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ బాలసరస్వతి, సిబ్బంది రామకృష్ణ, రామయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెంచాలి

కల్వకుర్తి టౌన్: ఆర్టీసీకి ఆక్యుపెన్సీ పెంచటమే లక్ష్యంగా విలేజ్ బస్సు ఆఫీసర్ కార్యక్రమాన్ని వినూత్నంగా ప్రారంభించామని డిపో మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్‌లో ఈ కార్యక్రమాన్ని సీఐ పార్థసారధితో కలిసి ప్రారంభించారు. ఆర్టీసీని గ్రామీణ ప్రాంతాల్లో బలోపేతం చేసేందుకు గాను, ముఖ్యంగా వారు ఆర్టీసీ ఎదుర్కొంటున్న సమస్యలు సంస్థ దృష్టికి తీసుకొని రావటమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు.



కల్వకుర్తిలో ప్రారంభిస్తున్న సీఐ, డీఎం

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించండి

అచ్చంపేట: ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణికులు వెళ్లేలా ఆ సంస్థ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం శుభ పరిణామమని అచ్చంపేట సీఐ అనుదీప్ అన్నారు. శుక్రవారం అచ్చంపేట అర్టీసీ బస్టాండ్ ఆవరణలో విలేజ్ బస్ ఆఫీసర్‌కు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టీసీ గ్రామాల ప్రజలకు అనుసంధాన కర్తలుగా సిబ్బందిని నియమించిందని, సిబ్బంది గ్రామాలకు వెళ్లి.. ప్రయాణికులు బస్సుల్లోనే ప్రయాణం చేసేలా అవగాహన కల్పిస్తూ ప్రచారం చేయాలని కోరారు. ఇప్పటికే శిక్షణ తీసుకున్న ఆఫీసర్లు సమయ వేళలపై విస్తృతంగా చైతన్యం కల్పించి బస్సుల్లోనే ప్రయాణం చేసేలా ప్రోత్సహించాలని కోరారు. ఆర్టీసీ డీఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అజిలాపూర్‌లో గాలివాన బీభత్సం



అజిలాపూర్‌లో విగిరిన విద్యుత్ స్తంభాలు



అచ్చంపేటలో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వెల్దండ: మండల పరిధిలోని అజిలాపూర్‌లో శుక్రవారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో విద్యుత్ సరఫరా లేక గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి గ్రామానికి విద్యుత్ సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు

అచ్చంపేట: అచ్చంపేట ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం సాయంత్రం వీచిన భారీ ఈదురు గాలులకు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రెండు వైర్లు కలవడంతో నిప్పు రాజుకుంది. అగ్నికి ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న చెత్త, గడ్డి అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. వెంటనే మున్సిపల్ వైస్ చైర్మన్ పోరెడ్డి శైలజ, చుట్ట పక్కల వారు ట్రాన్స్‌కో అధికారులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేకుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలకు ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ లీక్ కావడంతో మంటలు మరింత చెలరేగాయి. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయించి కరెంటు పునరుద్ధరించినట్లు ఏఈ అంజనేయులు తెలియజేశారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



ట్రాక్టర్ నడుపుకుంటూ వస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్

కొల్లాపూర్: పేదల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కొల్లాపూర్‌లోని మెహెబూబ్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ట్రాక్టర్ నడుపుకొంటూ వచ్చారు. పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కొల్లాపూర్, చౌటబెట్ల, బొల్లారం, యాపట్ల గ్రామాలకు చెందిన పలువురికి ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి కంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన అభివృద్ధే అధికమన్నారు. త్వరలోనే 167కే జాతీయ రహదారి పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ హనుమనాయక్, ఎంపీడీఓ చెన్నమ్మ, తహసీల్దార్ శివ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎంపీపీలు బోజ్యానాయక్, కమలేశ్వర్‌రావు, దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, చంద్రయ్యయాదవ్, కలమూరి నిరంజన్, గాలియాదవ్ తదితరులున్నారు.

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

కోడేరు: మండలంలోని కొండ్రావుపల్లికి చెందిన ఈశ్వరమ్మకు రూ.20 వేలు, గోపాల్‌కు రూ.16 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బీరం హర్షవర్ధర్ రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



వంగూరు: ప్రజాసమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్దం పర్వతాలు అన్నారు. శుక్రవారం వంగూరు మండలం రంగాపూర్‌లో నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మతోన్మాద విధానాలను అవలంభిస్తుందని అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతరం పోరాడుతుందని అన్నారు. సీపీఎం నాయకులు దేశ్యానాయక్, శ్రీనివాసులు, ఆంజనేయులు, బాలస్వామి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



జొన్నలబొగుడలో ఆంజనేయ దేవాలయం వద్ద..

పెద్దకొత్తపల్లి: జొన్నలబొగుడలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద శుక్రవారం ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం గ్రామస్తులు పెద్దఎత్తున తరలివచ్చి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వీక్షించారు. వీటితో పాటు వివిధ గ్రామాల్లోని జొన్నలబొగుడ గ్రామస్తులంతా కార్యక్రమానికి హాజరై ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను వీక్షించారు. సర్పంచ్ ఇందిరా రవినాయక్, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా బొడ్రాయి ఉత్సవాలు

లింగాల: మండల పరిధిలోని పద్మన్నపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సర్పంచ్ దేవి ఆధ్వర్యంలో శక్తి పూజారి బైండ్ల గిరి శక్తి పూజల మధ్య గ్రామ దేవతల ప్రతిష్ఠాపనలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున శక్తి పూజల నడుమ యంత్ర ప్రతిష్ఠాపన నిర్వహించిన శక్తి పూజారులు బొడ్రాయిని ప్రతిష్ఠించారు. అంతకు ముందు పలు రకాల పూజలు నిర్వహించగా.. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి గ్రామ ప్రజలు తరలివచ్చి గ్రామ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. సేవ్యా, రాజు నాయక్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

నేడు గ్రామ దిగ్బంధం

బొడ్రాయి ప్రతిష్ఠాపనలో భాగంగా వివిధ రకాల శక్తి పూజలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ సమయంలో గ్రామ దిగ్బంధం ఉంటుందని, రాత్రి 9 గంటల నుంచి ఆదివారం ఉదయం వరకు దిగ్బంధం కొనసాగుతుందని నిర్వాహకులు తెలియజేశారు.



పద్మన్నపల్లిలో బొడ్రాయి వద్ద..

బీసీ కులాలన్నింటికీ సాయం అందించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: చేతివృత్తులను నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న బీసీ కులాలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష సాయం అందించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక పథకాల అమలు లోపభూయిష్టంగా ఉన్నాయని ఆరోపించారు. రూ.6,299 కోట్ల బీసీ బడ్జెట్ ప్రకటించి, కేవలం రూ.200 కోట్లు మాత్రమే విడుదల చేశారన్నారు. ఈ మొత్తం సొమ్ముతో కేవలం 20 వేల మందికే లబ్ధి చేకూరుతుందని అన్నారు. 2 కోట్ల జనాభా కలిగిన బీసీలకు పూర్తి స్థాయిలో లబ్ధి చేకూరేలా ఈ పథకాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, సుధాకర్‌గౌడ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చారకొండ: మండలంలోని శాంతిగూడెంకు చెందిన రామిశెట్టి వెంకటేశ్వర్లుకు చెందిన పాడి ఆవు వ్యవసాయ పొలంలో మేతకు వెళ్లింది. శుక్రవారం ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

వైభవంగా పద్మావతి వేంకటేశ్వర కల్యాణం



చారకొండలో కల్యాణ మహోత్సవం

చారకొండ: వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీలక్ష్మీపద్మావతి వేంకటేశ్వర కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మి పద్మావతి వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో దేవాలయంలో ప్రత్యేక కల్యాణ మండపంలో ఈ మహోత్సవాన్ని అలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పురోహితులు కృష్ణ శర్మ, అనిల్ శర్మ, ప్రశాంత్ శర్మ అయ్యంగార్ ఆధ్వర్యంలో సాగిన కల్యాణ ఘట్టాన్ని తిలకించేందకు మండల కేంద్రంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేడుక తిలకించారు. కల్యాణం అనంతరం స్వామివారికి విరాళాలను అధిక సంఖ్యలో చెల్లించారు. చారకొండకి చెందిన విరబోమ్ము శ్రీనివాస్, శ్రీధర్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం భక్తులకు అన్నాదానం నిర్వహించారు. ఆలయ కమిటీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని సంతబజార్ కాలనీకి చెందిన ఎల్లయ్య(48) హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను తన ఇంటి ముందున్న డ్రెయినేజీలో ఈ నెల 6న ప్రమాదవశాత్తు జారీ పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా.. శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ఇంట్లో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని పెద్దముద్దునూరులో ఈ నెల 7న చోటుచేసుకోగా.. ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దముద్దునూరుకు చెందిన ఆకారపు శ్రీకాంత్ ఈ నెల 7న కోస్గిలోని తన అత్తగారి ఇంటికి వెళ్లగా.. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 14 తులాల బంగారం ఆభరణాలు, కిలో వెండి వస్తువులతో పాటు రూ.5 లక్షలు చోరీ చేశారు. శుక్రవారం ఇంటికి వచ్చి చూడగా.. దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పేదల కోసమే సంక్షేమ పథకాలు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి: రాష్ట్రంలోని పేద ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసమే పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడారు. రాష్ట్రంలో రూ.62 వేల కోట్లతో పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో రెండో విడుత రూ.6 వేల కోట్లతో 3.60 లక్షల కుటుంబాలకు గొర్రెల పంపిణీ కార్యక్రమం చేస్తున్నామన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు 44 లక్షల మందికి నెలకు రూ.955 కోట్ల పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఆర్డీఓ రాజేశ్‌కుమార్, తహసీల్దార్ రాంరెడ్డి, విజయ్‌గౌడ్, నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'సంబరాలు నిర్వహించడం సిగ్గుచేటు'



మాట్లాడుతున్న సతీష్ మాదిగ

మన్ననూర్: బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బందిని నియమించలేని చేతగాని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంబరాలు జరుపుకోవడం సిగ్గు చేటు అని అచ్చంపేట నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ సతీష్ మాదిగ ఆరోపించారు. శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి ఆయన మన్ననూర్‌లోని డీటీడీఓ, ఐటీడీఏ జిల్లా స్థాయి కార్యాలయాలను సందర్శించారు. కార్యాలయంలో ఇద్దరు తాత్కాలిక అటెండర్లు మినహాయిస్తే అధికారులు, సిబ్బంది ఏ ఒక్కరు కూడా లేకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమ రంగాలను నిర్వీర్యం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మంగ్యానాయక్, బాలాజీ, అమ్రాబాద్, పదర మండల అధ్యక్షుడు గోలి రాజు, మల్లేష్, రాము యాదవ్, అనిల్ శివ, రవి, రవీందర్, అఖిల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజాసంక్షేమ ప్రభుత్వం



బల్మూర్‌లో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

బల్మూర్: సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా వారి అభివృద్ధే లక్ష్యంగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కొనియాడారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయి సంక్షేమ సంబురాల కార్యక్రమం శుక్రవారం బల్మూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నా చివరి రక్తపు బొట్టు ఉన్నంత వరకు అచ్చంపేట నియోజకవర్గ ప్రజాల అభివృద్ధికి ఆహర్నిశలు పాటుపడుతానన్నారు. నల్లమల ప్రాంతమైన ఇక్కడ ప్రపంచంలోనే అతి ఎత్తైన లిఫ్ట్‌లకు నిధులు మంజూరు చేశారని, నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తానన్నారు. కులవృత్తుల వారిని ఆదుకోవడం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రూ.లక్ష ఆర్థిక సాయం పథకంలో పైరవీలకు తావులేకుండా అర్హులందరికీ పారదర్శకంగా అందిస్తామన్నారు.

చెక్కుల పంపిణీ..

దశాబ్ది సంబురాల్లో భాగంగా ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, కులాంతర వివాహాలు, ఆసరా పింఛన్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. దీంతో పాటు గొర్రెల యూనిట్లు మంజూరైన వారికి ప్రొసిడింగ్‌లను అందజేశారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

అచ్చంపేట: నల్లమల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం అచ్చంపేట వంద పడకల ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, సుదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ దినోత్సవం ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేయాలని, అధికారులు స్ఫూర్తి నింపేందుకు కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

ఆడబిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి

చారకొండ: ప్రతి ఆడబిడ్డకు ప్రోత్సాహకంగా కల్యాణలక్ష్మి పథకం అందుతుందని అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం బల్మూరులో సంక్షేమ పథకాల సంబురాల్లో భాగంగా మండలం నుంచి నాయకులు, అధికారులు హాజరయ్యారు. చారకొండ, తుర్కలపల్లి గ్రామాలకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లిలో ఆరు రోజుల కిందట కాశమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

మున్సిపల్ చైర్మన్ పరామర్శ

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఇందిరానగర్‌లో రాజు అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కౌన్సిలర్ సైదులుగౌడ్, శేఖర్, శేఖర్‌గౌడ్, ఆంజనేయులు యాదవ్, మధు, చిన్న ఉన్నారు.